క్లుప్తంగా

దర్గాలో భక్తుల సందడి

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామివారి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

ఆదోని టౌన్: ఆదోని ఆర్టీసీ డిపో పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను 15 సంవత్సరాల కాల వ్యవధితో అద్దె (లీజుకు) ఇవ్వనున్నామని, అందుకు సంబంధించి టెండర్‌లను ఆహ్వానిస్తున్నట్లు డీఎం రఫీక్‌అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ప్రక్రియపై చర్చించేందుకు కర్నూలులోని డీపీటీఓను సంప్రదించాలన్నారు. ఆసక్తి ఉన్న ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలకు ఈనెల 13వ తేదీన సాయంత్రం ఆదోని ఆర్టీసీ డిపోలో లీజు స్థలాలపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. డిపో పరిధిలో 1.30 ఎకరాలు ఖాళీ స్థలం ఉన్నట్లు డీఎం తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



రూరల్ పోలీస్‌స్టేషన్లో మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ శివనారాయణస్వామి

ఎమ్మిగనూరురూరల్: ప్రతిఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ శివనారాయణ స్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ, ప్రపంచ జనాభా దినోత్సవాల సందర్భంగా స్కూల్ నుంచి వైఎస్సార్, సోమప్ప సర్కిల్ వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం రూరల్ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ శివనారాయణస్వామి పాల్గొని మొక్కలు నాటారు. టౌన్, రూరల్, గోనెగండ్ల, మంత్రాలయం సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, ఏరిసావలి, ఎస్‌ఐ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, డాక్టర్ బాలాజీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఫారెస్టు రేంజ్ అధికారి తేజశ్విని పిలుపునిచ్చారు. గురువారం ఎస్‌జీఓస్ కాలనీలోని భాష్యం పాఠశాలలో పర్యావరణ దినోత్సవం, ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి అధ్యక్షతన చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన



మురుగు కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలోని 5 వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి కలియతిరిగారు. మురుగు కాలువలను శుభ్రం చేసే పనులను, చెత్త కుప్పలను తొలగించే పనులను పరిశీలించారు. గురువారం ఎన్‌జీవోస్ కాలనీ, అరుణ్ జ్యోతిన గర్ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మురుగు కాలువలను ఏరోజుకారోజు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య విభా గం అధికారులకు సూచించారు. విధుల పట్ల అలసత్వం వహించవద్దన్నారు. శానిటరీ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్థలం కబ్జా కాలేదు'



మాట్లాడుతున్న వడ్డె తాయమ్మ, స్థానిక నాయకులు రవి

ఆదోని టౌన్: ఆదోని పట్టణం అమరావతి నగర్‌లోని తన ప్లాటు కబ్జాకు గురికాలేదని, దీనిపై కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు పూర్తి అవాస్తవం అని స్థల యజమాని వడ్డె తాయమ్మ స్పష్టం చేశారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తనకు కేటాయించిన ప్లాట్ నంబర్ 199 కాదని 299 అని తెలిపారు. కొంతమంది రాజకీయ పార్టీ నాయకులు తనను మభ్యపెట్టి తప్పుడు సమాచారం ఇవ్వడంతో నిజం తెలియక అలా మాట్లాడినట్లు చెప్పారు. వాస్తవానికి తనకు కేటాయించిన ప్లాట్‌ను ఎవరూ కబ్జా చేయలేదని, ప్లాటు కబ్జాకు గురైనట్లు వచ్చిన వార్తలను ఖండించారు. అలాగే స్థానిక నాయకులు ఎర్రిస్వామి, రవి, వలీ ప్రభావం ఏమీలేదని ఆమె చెప్పారు.


తల్లికి మోసం

తల్లికి వందనం పథకంలో చంద్రబాబు తిరకాసు

- విద్యార్థులందరికీ కాకుండా తల్లికి రూ.15 వేలు అంటూ మెలిక
- జీఓ 29 విడుదలపై తల్లుల ఆందోళన
- తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్



టీడీపీ మేనిఫెస్టోలో ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని స్పష్టంగా పేర్కొన్న దృశ్యం



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.
STUDENT KITS	Under Vidya Kanuka, the Government school students of Classes I to XII are provided with the following benefits: (i) Bilingual Textbooks (English content on one page and Telugu version on the opposite page) (ii) Notebooks and Workbooks (iii) Three pairs of Uniforms with stitching charges (iv) A pair of Shoes and two pairs of Socks (v) A Belt and a School Bag

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జీఓలో తల్లికి రూ.15 వేలు మాత్రమే అందిస్తామంటూ పేర్కొన్న దృశ్యం

తల్లికి వందనం పథకంలో మొదటికే మోసం తెచ్చి పెట్టారు. ఎన్నికల వేళ విద్యార్థులందరికీ రూ.15 వేలు చొప్పున పరిమితం లేకుండా నగదు పంపిణీ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. ఇప్పుడేమో తల్లికి మాత్రమే నగదు పేరుతో విద్యాశాఖ నుంచి జీఓ 29 తెరపైకి తెచ్చారు. జీఓ విడుదలతో విద్యార్థుల తల్లిదండ్రులు చంద్రబాబు తీరుపై చీవాట్లు పెడుతున్నా రు. లక్షలాది మంది తల్లులను

మంత్రాలయం: మాట ఇవ్వడం.. వెనువెంటనే తప్పడం లేదంటే మాటమార్చడం చంద్రబాబు నైజం. గద్దె కోసం గారడీ పలుకులు పలకడం.. హామీలను తుంగలో తొక్కడం బాబుకు షరామామూలే. అధికారంలోకి వచ్చీ రాగానే పథకాలకు ఎసరు పెట్టే పనిలో పడ్డారు. నిలువునా మోసం చేశాడని దుమ్మెత్తి పోస్తున్నారు. 2014లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మోసగించారని, తాజాగా తల్లికి వందనం హామీతో మహిళా లోకాన్ని ముంచారని వాపోతున్నారు.

ఏరు దాటి తెప్ప తగలేశారు



చంద్రబాబు తీరు ఏరు దాటి తెప్ప తగలేసినట్టుగా ఉంది. లక్షలాది మంది పేదలు తల్లికి వందనం పథకంపై ఆశలు పెట్టుకుని ఓట్లు వేశారు. అధి కారంలోకి రాగానే ఇలా మాట తప్పడం శోచనీయం. మాకు ముగ్గురు కుమారులు ఉండగా తల్లికి వందనం పథకంపై నమ్మకం పెట్టుకుని ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాం. ఇప్పటికే పిల్లల చదువులకు సగం ఫీజులు కట్టాం. ఉన్నపాటున ప్రభుత్వం ఒక్కరికే నగదు అంటూ ప్రకటించడం బాధాకరం. మాలాంటి పేదలు పిల్లలను ఎలా చదివించుకోవాలో దిక్కుతోచడం లేదు. ఇప్పటికైనా ప్ర భుత్వం ఇచ్చిన మాటపై నిలబడి న్యాయం చేయాలి.

– లక్ష్మీదేవి, నందవరం

మాట మార్చడం సరికాదు



మాకు ఇద్దరు సంతానం. కుమార్తె ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి, కుమారుడు ఆది ఆంధ్ర పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నారు. మాకు ఎలాంటి పొలాలు, ఆస్తి పాస్తులు లేవు. పూరి గుడిసెలో నివాసం ఉంటూ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ బతుకీడుస్తున్నాం. పిల్లల చదువులు, పోషణకు ఏడాదికి రూ.40 వేల వరకు ఖర్చు వస్తుంది. పిల్లలందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామనడంతో సంతోషించాం. మొదట్లోనే పభుత్వం చేతులెత్తేయడం సరికాదు.

– పార్వతి, కోసిగి

పిల్లలందరికీ ఇస్తామన్నారు



నా పిల్లలు ఒకరు 9వ తరగతి, మరొకరు 5వ తరగతి చదవుతున్నారు. అమ్మకి వందనం పేరిట కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలున్నా ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున అందిస్తామని ఎన్నికలప్పుడు చెప్పారు. ఇప్పుడు రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం బాధాకరం. ఓట్ల కోసం ఒకలా ఇప్పుడు మరోలా చెప్పడం మహిళలను మోసగించడమే.

– మారెమ్మ, కౌతాళం

ముమ్మాటికీ మోసగించడమే



నాకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భర్త ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. సుగ్గికి వెళ్లి జీవనం సాగిస్తున్నాం. పెద్ద కూతురు ఓపెన్ డిగ్రీ చేస్తూ చేదోడుగా ఉంటోంది. కవలలైన కుమారుడు, కూతురు 3వ తరగతి, చివరి కూతురు 2వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం చెప్పిన ప్రకారం అమలుచేస్తే మా పిల్లల చదువుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని నమ్మకం పెట్టుకున్నా. ఇప్పుడు ప్రభుత్వం తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో కష్టాలు మొదటికి వచ్చాయి. పిల్లలను ఎలా చదివించుకోవాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇలా మోసగించడం సరికాదు.

– రామాంజినమ్మ, కోసిగి

మాట నిలుపుకోవాలి



మాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు ఇంటర్, చిన్న కూతురు 8వ తరగతి చదువుతున్నారు. కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. తల్లికి వందనం కింద ఏటా రూ.15 వేలు ఇస్తారంటే ఇక బెంగ లేదనుకున్నాం. ఉన్నపాటున ప్రభుత్వం ఒక్కరికే నగదు ఇస్తామని చెప్పడం విచారకరం. గతంలోనూ చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదు. ఇప్పుడేమో తల్లికి మాత్రమే డబ్బు ఇస్తామనడం పద్ధతి కాదు. పేదల పిల్లల చదువులు గట్టెక్కడం ప్రస్తుత రోజుల్లో కష్టం. హామీ ఇచ్చి చేతులెత్తేయడం నిజంగా మహిళలను మోసగించినట్టే. ఇచ్చిన మాట ప్రకారం ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు మంజూరు చేయాల్సిందే.

– సావిత్రి, మంత్రాలయం

ఇకనైనా మారతాడు అనుకున్నాం



నాకు ఇద్దరు సంతానం. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే స్తోమత లేక గవర్నమెంట్ స్కూల్‌లో చదివిస్తున్నా. పిల్లలు 2, 3 తరగతులు చదువుతున్నారు. నేను కూలికి పోయి బతుకీడుస్తున్నాను. రెక్కాడితే గానీ డొక్కాడని మా బతుకులకు గత ప్రభుత్వంలో జగనన్న అన్ని విధాలుగా తోడుగా ఉన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి రూ.15 వేల చొప్పన ఇస్తానని హామీ ఇవ్వడంతో సంతోషించాం. చంద్రబాబు ఇకనైనా మారతాడని నమ్మకంపెట్టుకుంటే మళ్లీ మోసం చేశారు.

– సిద్దమ్మ పెద్దకడబూరు

చాలా ఇబ్బందులు పడాల్సివస్తుంది



అమ్మకు వందనం పథకం కింద తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం జారీ చేసిన జీఓతో మా లాంటి నిరుపేదలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నేను. నా భర్త కూలి పనులు చేసుకుంటూ పిల్లలను ఎర్రకోట గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాం. పిల్లల చదువులకు సగం ఫీజు కూడా చెల్లించాం. ప్రభుత్వం ఇద్దరు పిల్లలకు రూ. 30 వేలు చెల్లిస్తుందని, ఆ నగదు ఎంతో ఆసరాగా ఉంటుందని అనుకున్నాం. ఇప్పుడు కోత పెట్టడం సరికాదు.

– బోయ రామలింగమ్మ, అలువాల గ్రామం

ఒక్కొక్కరికీ రూ.15 వేలు అంటే సంతోషపడ్డాం



నాకు 6వ తరగతి చదివే మనీష్, 3వ తరగతి చదవే మధుశ్రీ ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదుతున్నారు. ప్రభుత్వం ఇద్దరికి రూ.30 వేలు ఇస్తుందని ఆశపడి ప్రైవేట్ స్కూల్లో ఫీజులు చెల్లించాం. ఇప్పుడు ఒక్కరికే నగదు ఇస్తామని చెప్పడంతో భయమేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో చేర్పిద్దామనుకుంటే ప్రైవేట్ స్కూల్లో ఫీజు చెల్లించాక ఇప్పుడు ఎక్కడికీ పోలేని పరిస్థితి. సీఎం చంద్రబాబు పునరాలోచించుకుని చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చెల్లించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

– ధరణి, ఎమ్మిగనూరు

వైభవంగా వరదేంద్రతీర్థుల పూర్వారాధన



భక్తులకు ముద్రధారణ గావిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: మధ్వ మత మూల సంస్థానం రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధపతి వరదేంద్రతీర్థుల పూర్వారాధన వేడుకలు వైభవంగా జరిగాయి. గురువారం మహారాష్ట్రలోని పూణెలో వరదేంద్రతీర్థుల క్షేత్రంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల చేతుల మీదుగా వేడుకలు చేపట్టారు. వేడుకలో భాగంగా వరదేంద్రల మూల బృందావనానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు గావించి హారతులు పట్టారు. అనంతరం రాములోరి సంస్థాన పూజలో స్వామిజీ తరించారు. భక్తులకు స్వామిజీ తప్త ముద్రధారణ గావించి అన్న ప్రసాద, తీర్థ వితరణ నిర్వహించారు.

మొహర్రం ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణయ్య

గోనెగండ్ల: మొహర్రం వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మొహర్రం వేడుకలను గ్రామాల్లోని ప్రజలు కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని మత పెద్దలకు సూచించారు. అలాగే మండలంలోని మత పెద్దలను సమావేశపరిచి మొహర్రం వేడుకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు చెప్పారు. మొహర్రం పండుగ ముగిసే వరకు ఆయా గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

యాంప్లిఫైయర్, స్పీకర్లు విరాళం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో ప్రవచనాలు, భక్తిగీతాలు, దేవస్థానం వారి సూచనలు భక్తులకు స్పష్టంగా వినిపించేలా రూ.70 వేలు విలువైన యాంప్లిఫైయర్, స్పీకర్లను గురువారం భక్తులు విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేష్ తెలిపారు. కర్ణాటకలోని రాయచూర్ పట్టణవాసులైన కటకం సత్యనారాయణ, వాసంతి కుటుంబ సభ్యులతో కలిసి ఆహుజా కంపెనీ స్పీకర్లు, యాంప్లిఫైయర్‌ను దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే స్వామివారి పూలమాల, శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదాలు, ఆశీర్వాదాలు కల్పించి బాండు, ఫోటోను అందజేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ కుమార్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

ఆదోని అర్బన్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ మంజునాథ్ పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్, ప్రధాన రహదారుల్లో గురువారం హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ఉంటే ప్రమాద సమయంలో రక్షణ ఉంటుందన్నారు. ఏఎస్‌ఐలు లక్ష్మన్న, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు కార్డులు

ఆదోనిరూరల్: అర్హులైన కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏడీఏ అరుణకుమారి సూచించారు. మండలంలోని విరుపాపురం గ్రామంలో గురువారం కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. కౌలు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

ఆదోని టౌన్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ఆదోని పట్టణంలో డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల సిబ్బంది భారీ ప్రదర్శన నిర్వహించారు. మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి నుంచి పాత బస్టాండ్ సర్కిల్ మీదుగా ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, పీపీ యూనిట్ డాక్టర్ లక్ష్మిప్రసన్న, డాక్టర్లు మానస, అనిల్‌కుమార్, గాయత్రీ మాట్లాడారు. ప్రపంచ జనాభా పెరిగిపోతుందని, ప్రతిఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని పిలుపునిచ్చారు. జనాభా పెరుగుదలతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. కుటుంబ నియంత్రణ పాటిద్దాం సమాజాన్ని కాపాడదాం అని పిలుపునిచ్చారు. సూపర్‌వైజర్లు సీతారాముడు, ఇంద్రదుర్తి, అరుణ, జ్ఞానేశ్వరి, మల్లికార్జున, నాగరాజ్, స్టాఫ్ నర్సులు, మెయిల్ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌లో శుభ్రత పాటించాలి



వ్యాపారులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో దుకాణాల వద్ద వ్యాపారులు శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. ఆయన గురువారం డీఈ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో కలిసి కూరగాయల మార్కెట్‌లో కలియతిరిగి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కుళ్లిన కూరగాయల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని వ్యాపారులను హెచ్చరించారు. దుకాణాల వద్ద శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, కుళ్లిన వాటితో దుర్గంధం వెదజల్లి ఈగలు ముసిరి వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. దీతో ఇటు వ్యాపారులు, మార్కెట్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్లలో తరలిస్తారని వారికి సహకరించాలని మార్కెట్‌లో ప్రజలకు ఇబ్బందిలేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

జనాభా పెరుగుదలను నియంత్రించాలి

ఆదోని సెంట్రల్: జనాభా పెరుగుదలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, అధ్యాపకుడు డాక్టర్ అయ్యప్ప సూచించారు. గురువారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకున్నారు. ముందుగా పేదరికం, తల్లి ఆరోగ్యం వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రయత్నించాలన్నారు. కుటుంబ నియంత్రణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా పెరగడం వల్ల అర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. ప్రతికూల పరిస్థితులపై అవగాహన కలిగి జనాభా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అధ్యాపకులు రామకృష్ణ, గోవిందు, ఈరన్న, నిఖిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 450కు పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల్లోని కళాశాలలకు చదువుకునేందుకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. ఎస్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ ధీరజ్

ఆదోని రూరల్: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ ధీరజ్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు తాలూకా సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో కలిసి సంతె కూడ్లూరు గ్రామ బస్టాప్ వద్ద తనిఖీలు చేపట్టి.. ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందిన బోయ ఆరేకంటి భీమలింగ, చెన్నప్ప కర్ణాటకలోని నాగరహాల్‌లో వైన్ షాపులో 6 లిక్కర్ బాక్సులను కొనుగోలు చేసి ఏపీ 39 యూకే 6408 నంబర్ గల ఆటోలో తరలిస్తుండగా మాధవరం రోడ్డులోని కోసిగి క్రాస్ వద్ద పట్టుకున్నట్లు వివరించారు. అలాగే కోసిగికి చెందిన గోపాల్, లక్ష్మీకాంత్ 6 బాక్సుల మద్యంను ఏపీ 21 ఎస్ 0240 టీవీఎస్ స్పోర్ట్ బైక్‌పై తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. పెద్దతుంబళంకు చెందిన రాజేష్‌కు మద్యాన్ని విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. అలాగే పెద్దతుంబళం గ్రామంలో బోయ గోవిందు ఇంట్లో రెండు బాక్సుల మద్యంను దాచి ఉంచి గ్రామస్తులకు విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అక్రమ మద్యం రవాణాకు ఉపయోగించిన ఆటో, బైక్, 14 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐలు శ్రీనివాసులు, చిన్నపీరయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. సమష్టిగా ఎదుర్కొందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి




హాజరైన నాయకులు, కార్యకర్తలు

కౌతాళం: పార్టీ శ్రేణులు అధైర్య పడవద్దని, సమస్యలను కలిసికట్టుగా ఎదుర్కొందాం, ప్రజల పక్షాన పోరాడదాం అని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మండల నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల అభిమాన్ని ఎప్పటికీ వృథా చేయనన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన వద్దకు రావచ్చని ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు మెజారిటీ ఇచ్చిన మండల ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కౌతాళం ఖాదర్ లింగస్వామి, ఉరుకుంద ఈరన్నస్వామి, మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆశీస్సులతో పాటు ప్రజల ఆశీస్సులు తనను గెలిపించాయన్నారు. అధికార తెలుగుదేశం పార్టీలో ఇప్పటికే వర్గపోరు, దళారీ వ్యవస్థ ప్రారంభమైందని, ఇన్‌చార్జ్ హోదా కోసం కుస్తీలు పడుతున్నారని చెప్పారు. పర్మినెంట్‌గా ఉన్న రేషన్‌షాపుల డీలర్లను తొలగించడానికి వీల్లేదని, ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలంటే నిబంధనలు ఉన్నాయన్నారు. అధికారులు ప్రొటోకాల్ పాటించకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. అంతకుముందు.. ఇటీవల మృతి చెందిన బదినేహాల్ సింగల్ విండో అధ్యక్షుడు అత్రితనయగౌడ్‌తో పాటు దేశాయికృష్ణ, విరుపాక్షప్పలకు ఒక నిమిషం పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. జడ్పీటీసీ రాధప్రియదర్శిని, ఉప్పర హాల్ ఏకాంబర్‌రెడ్డి మాట్లాడుతూ.. 40 శాతం మంది ప్రజలు వైఎస్సార్‌సీపీవైపే ఉన్నారని వారిపక్షాన పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, నాయకులు దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, కామవరం మహేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

– కామవరం గ్రామంలో వెలసిన శివరామ దూత ఆశ్రమంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన గదులను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్థానిక నేత వీరేసనరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు మఠం తాత అవ్యక్తనంద సరస్వతి స్వాములు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

చౌక ధరకే నిత్యావసర సరుకులు



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని అర్బన్: ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసర సరుకులను అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. పట్టణంలోని రైతుబజార్‌లో గురువారం నిత్యావసర సరుకుల పంపిణీ కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి ప్రారంభించారు. ఈ కేంద్రంలో కిలో కందిపప్పు రూ.160, సోనామసూరి బియ్యం కేజీ రూ.49కే అందిస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారుడికి నేరుగా అందేవిధంగా పనిచేయాలని ఎమ్మెల్యే పార్థసారథి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు.

– స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదోని-బెంగళూరు నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే డిపో మేనేజర్ రఫీక్‌తో కలిసి ప్రారంభించారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ ఉద్యోగులు ఆహర్నిశలు శ్రమిస్తున్నారని అలాంటి వారిని గౌరవించాలని సూచించారు.

– తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లాధ్యక్షుడు రంగస్వా మి, సీనియర్ నాయకులు లక్ష్మన్న, రాముడు, డిపో కార్యదర్శి ఉలిగప్ప, గ్యారేజీ కార్యదర్శి యేసురాజు, సీనియర్ నాయకులు బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ.. కార్మి కుల పోరాట ఫలితంగానే ఉద్యోగులకు వైద్య సదుపాయం, పనిగంటల విధానం, వారాంతపు ఆఫ్‌లు తదితర సంక్షేమ పథకాలను సాధించుకోవడం జరిగిందన్నారు. నాయకులు రమణమూర్తి, సుధాకర్, గౌడ్, రమేష్, ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై సమీక్ష



సమస్యలపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు, సాగునీటి అంశాలపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో వర్షపాతం నమోదు, ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయనే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా కర్నూలు రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక స్థలం ఆక్రమణలపై పలు కులసంఘాల నాయకులు గణేష్, బజారప్ప, గురుస్వామి, యాపిలయ్య తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చి సమస్యను వివరించారు. వ్యవసాయ, సాగునీటి సరఫరా అధికారులు పాల్గొన్నారు.